సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 1 । జూన్ । 2023



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

సిరిసిల్ల: చంద్రంపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఎన్పీడీసీఎల్, 'సెస్' అధికారులు మరమ్మతులు చేపట్టారు.



7న వస్త్ర పరిశ్రమ బంద్

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ అందించడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 7న వస్త్రపరిశ్రమ బంద్ చేపడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పొగాకు ప్రాణాంతకం



సిరిసిల్లటౌన్: పొగాకు ఉత్పత్తుల సేవనం ప్రాణాంతకమని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అంబేద్కర్‌నగర్ యూహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. 'మాకు ఆహారం కావాలి..పొగాకు వద్దు' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పొగాకు ఉత్పత్తులు వినియోగంతో కిడ్నీలు పాడవుతాయని, వివిధ క్యాన్సర్లకు దారితీస్తుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ తీశారు. డాక్టర్ నయీంజహా, ప్రోగ్రాం ఆఫీసర్ డి.కృష్ణవేణి, డాక్టర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు అదరగొట్టాలి



వేములవాడ: ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి కోరారు. బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడారు. ముందుగా కౌన్సిలర్లకు అందించిన ఎజెండా అంశాలపై చర్చించారు. రానున్న వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. కమిషనర్ అన్వేశ్, పబ్లిక్ హెల్త్ డీఈ తిరుపతి, ఏఈ నర్సింహస్వామి, నర్మద పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి రాజన్న ప్రసాదం



సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్

వేములవాడ: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా రాజన్న ఆలయ మాజీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బుధవారం కలిసి రాజన్న ప్రసాదం అందించారు. శాలువాతో సత్కరించారు.

ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఫిష్ ఫెస్టివల్



రుద్రంగి(వేములవాడ): పేద, మధ్యతరగతి గంగపుత్ర మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ రకాల చేపల వంటకాలపై శిక్షణ ఇచ్చి.. ఫిష్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తుందని జిల్లా ఫిషరీష్ అధికారి శివప్రసాద్ తెలిపారు. సిరిసిల్లలో ఈనెల 8, 9, 10 తేదీలలో నిర్వహించే ఫిష్ ఫెస్టివెల్‌లో పాల్గొనే రుద్రంగి, చందుర్తి గంగపుత్ర మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. సిబ్బంది కిరణ్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చిట్టపురం గంగాధర్, ఉపాధ్యక్షుడు గాజ నర్సయ్య, కోషాధికారి ఎల్ల గంగాధర్, పాలకవర్గ సభ్యులు ద్యావల శంకర్, గాజె భూమయ్య, గణేశ్, గంగారాం, సంఘ సభ్యులు దేశవేని శ్రీనివాస్, శిక్షణ పొందిన మహిళలు దేశవేని లత, చిట్టపురం వాణి, గాజె లత తదితరులు పాల్గొన్నారు.

బాలాలయ నిర్మాణానికి భూమిపూజ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని పురాతన శివాలయంలో రుక్మిణీ సత్యభామసమేత శ్రీవేణుగోపాలస్వామి బాలాలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఆలయం పునర్ నిర్మాణంలో భాగంగా శాంతిహవనం, వాస్తుహవనం, విశ్వక్సేన విజ్ఞాపన పూజలను కల్వకుంట్ల వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, పురోహితులు బిట్కూరి నవీన్‌చారి, రాచర్ల దయానంద్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, ఉపాధ్యక్షుడు ముత్యాల పల్లవి, ప్రభాకర్‌రెడ్డి, ముప్పాపురం రాధాకృష్ణారావు, బాల్‌రెడ్డి, నర్సింహులు, మమతారెడ్డి, ఉదయలక్ష్మి, విజయ, లావణ్య, మంజుల పాల్గొన్నారు.



వేదికపై ఉత్సవమూర్తులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

గోవిందా.. హరి గోవిందా వేంకటరమణ గోవిందా

అన్నమాచార్య కీర్తనలు.. ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితుల మంత్రోచ్చరణలు.. వెల్లువిరిసిన భక్తి పారవశ్యం మధ్య బుధవారం సాయంత్రం కరీంనగర్ పద్మనగర్‌లో శ్రీనివాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తంతులో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్ రావు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, సీపీ సుబ్బరాయుడు పాల్గొన్నారు. అంతకుముందు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన వైభవంగా జరిగింది.

– కరీంనగర్‌కల్చరల్





తాళిబొట్టు చూపుతున్న పండితుడు





పట్టువస్త్రాలు తీసుకొస్తున్న నాయకులు



శోభాయాత్రలో ఆకట్టుకున్న అంబారీలు



పట్టువస్త్రాలు చూపుతున్న అర్చకుడు



బండి సంజయ్‌ని ఆశీర్వదిస్తున్న పండితుడు

పల్లెల్లో ఫిజియోథెరపీ

- కలెక్టర్ చొరవతో ఉచిత సేవలు
- వృద్ధులు, పక్షవాతం రోగులకు వరం
- జిల్లాలో 9 పీహెచ్‌సీలలో అందుబాటులోకి..
- రూ.12.78 లక్షలతో ఏర్పాటు



పోతుగల్‌లో సిద్ధమైన ఫిజియోథెరపీ కేంద్రం



సేవలందిస్తున్న స్టాఫ్‌నర్స్

ముస్తాబాద్(సిరిసిల్ల): పక్షవాతం.. ప్రమాదాలకు గురైన వారు.. వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడేవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఖరీదైన వైద్యసేవలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందుతున్నాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి చొరవతో పట్టణాలకు పరిమితమైన ఫిజియోథెరపీ సేవలు జిల్లాలోని 9 పీహెచ్‌సీలలో ప్రారంభమయ్యాయి.

కలెక్టర్‌ను కదిలించిన ఘటనలు

కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఆ సమయంలో ఫిజియోథెరపీ సేవలు అందని పక్షవాతం, రోడ్డు ప్రమాద బాధితుల బాధలు స్వయంగా చూశారు. వృద్ధులు పలు నొప్పులతో బాధపడే సంఘటనలు కలెక్టర్‌ను కదిలించాయి. ఈ సంఘటనలతో స్పందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.42 లక్షలతో జిల్లా వ్యాప్తంగా 9 పీహెచ్‌సీలలో 12 రకాల సేవలందించే ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ఇల్లంతకుంట, చందుర్తి, తంగళ్లపల్లి, వేములవాడ మండలంలోని కొదురుపాక, కోనరావుపేట, వేములవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్ర ఆసుపత్రితోపాటు వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఫిజియోకేంద్రాలు ఉన్నాయి. ప్రైవేటు కేంద్రాలలో ఒక్క సిట్టింగ్‌కు రూ.200 నుంచి రూ.300 ఖర్చు అవుతుంది.

అందుబాటులో ఈ సేవలు

పక్షవాతం, రోడ్డు ప్రమాదాలలో గాయపడి అంగవైకల్యం కలిగిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కేంద్రాలలో సేవలందిస్తారు. ఇందుకుగాను ఇప్పటికే స్టాఫ్‌నర్స్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇప్పటికే జిల్లాలో 460 మందికి వారం రోజులుగా ఫిజియోథెరపీ సేవలందిస్తున్నారు. భుజం, చీలమండ గాయాలు, వేలు నిచ్చెన, ఇసుక బస్తాలు, స్టీమ్ మోడల్, సమతుల్య బోర్డు, క్వాడ్రిపుల్స్ టేబుల్స్, షోల్డర్ ఓవర్‌హెడ్, అల్ట్రాసౌండ్, బాల్, టుసీహెచ్ స్టిమ్యులేటర్ మోడల్, ఐఎఫ్‌టీ మోడల్‌తోపాటు నడుం, మెడ, భుజాల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, ఏదైనా గాయం కారణంగా వైకల్యం ఏర్పడితే దానికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తారు. ప్రధానంగా పక్షవాతం, వృద్ధులకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. గర్భిణులకు సైతం సులభంగా ప్రసూతి అయ్యేలా ఇక్కడ ఆసనాలు వేయిస్తారు.

32 మందికి థెరపీ చేస్తున్నాం



పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారం రోజుల క్రితమే ఫిజియోథెరపీ సేవలు ప్రారంభించాం. సిరిసిల్లలో శిక్షణ పొందాం. ఇప్పటికే 32 మందికి ఫిజియో సేవలు అందించాం. ఎంతో మంది వృద్ధులు, మహిళలు, పక్షవాతం ఉన్నవారు ఇక్కడికి వస్తున్నారు. ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తున్నాం. వారి నుంచి స్పందన బాగుంది.

– వేల్పుల రమ్య, స్టాఫ్‌నర్స్, పోతుగల్

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మంత్రి కేటీఆర్ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్ గొప్ప దయగుణంతో ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేదలు, వృద్ధులకు ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రతీ సిట్టింగ్‌కు రూ.300 పెట్టుకోలేని పేదలకు ఇదొక వరం. థ్యాంక్స్ టు కలెక్టర్.

– నవాజ్, ముస్తాబాద్

9 కేంద్రాలు నడుస్తున్నాయి



వృద్ధులు, మహిళలు పడుతున్న బాధలను కలెక్టర్ స్వయంగా చూసి ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణాలకు వెళ్లలేని వేలాది మంది రోగులకు స్వాంతన చేకూర్చేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేయించారు. 9 కేంద్రాలు బాగా నడుస్తున్నాయి. పల్లె ప్రజలు బాగా ఉపయోగించుకుంటున్నారు. వ్యయ, ప్రయాసలు తప్పాయి.

– డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

పాడిగేదెలకు రుణాలివ్వాలి



సిరిసిల్ల: జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న పాడిగేదెల పథకానికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఇంకా మిగిలి ఉన్న యూనిట్లకు రుణాలు అందించి రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమకు రుణాలిస్తే.. రైతులకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని, సమాజానికి నాణ్యమైన పాలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో పీఎంఎఫ్ఎంఈ పథకాలకు రుణాలు అందించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు బ్యాంకర్లు రుణాలు ఇస్తే.. జిల్లాలో మెరుగైన ఉపాధికి బాటలు పడతాయని పేర్కొన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని బ్యాంకుల ద్వారా ఈ వార్షిక సంవత్సరం రూ.2,725 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు రూ.2,579 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ అధికారి అపర్ణరెడ్డి, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణ, ఎస్‌బీఐ చీఫ్‌మేనేజర్ ఆంజనేయులు, డీఏవో భాస్కర్, పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు, పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, జౌళిశాఖ ఏడీ సాగర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్ ర్యాలీ



సిరిసిల్లలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛమైన బాధ్యతతో పట్టణంలోని ప్రతీ పౌరుడు మెదలాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్‌చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు జరిగిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మే 15 నుంచి జూన్ 5 వరకు 'మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ వార్డు నుంచి చెత్తను రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ట్రిపుల్ ఆర్) పద్ధతిని అవలంబిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దూమపానంతో అనేక అనారోగ్య సమస్యలు



కార్మికులతో మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్ల: దూమపానంతో శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ పేర్కొన్నారు. స్థానిక గణేశ్‌నగర్‌లోని మరమగ్గాల కార్ఖానాలోని కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పున్నంచందర్ మాట్లాడుతూ తంబాకు నమలడం, పొగ తాగడం ద్వారా క్యాన్సర్, అల్సర్, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, నరాల బలహీనత వంటి సమస్యలు వస్తాయన్నారు. దూమపానాన్ని మానేయాలని కోరారు. మనోవికాస కేంద్రం సిబ్బంది వేముల అన్నపూర్ణ, బూర శ్రీమతి, రాపెల్లి లత, కొండ ఉమ, పవర్ లూమ్ కార్మికులు పాల్గొన్నారు.



ఉదయం.. గడియారం ఇలా..



సాయంత్రం.. కనిపించదేమీ..

గడియారంపై పట్టింపేది?

సిరిసిల్ల పట్టణ సుందరీకరణలో భాగంగా కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఐ లవ్ సిరిసిల్ల లోగోను ఏర్పాటు చేశారు. లోగోలో గడియారాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయితే బుధవారం ఉదయం లోగోలో ఉండాల్సిన గడియారం కాస్త రేయిలింగ్‌కు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ఆ గడియారం అక్కడి నుంచి మాయమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



వైభవంగా కల్యాణం

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆధ్యా గోలి ఫౌండేషన్ చైర్మన్ మోహన్ గోలి, తిరుపతి ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పెంద్యాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జగదాంబదేవి ప్రతిష్ఠ ఉత్సవాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మొర్రాపూర్‌తండాలో శ్రీజగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థాపిత దేవతాపూజ, విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పూజలు చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మోహన్ అన్నారు. బుధవారం నారాయణపురం, హరిదాస్ నగర్ గ్రామాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశాల కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూపాయి ఖర్చులేకుండా ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు తిప్పడం లేదని జిల్లా సీపీఐ రైతు సంఘం కార్యదర్శి జంగం అంజయ్య, ఉపాధ్యక్షుడు గజ్జల ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బస్తాకు 3 కిలోల తరుగు తీస్తున్నారని, తూకం వేసి 15 రోజులు గడుస్తున్నా లారీలు రావపోవడంతో బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటున్నాయని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి రైతులకు డబ్బులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఖానాపురం అరుణ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల ప్రధాన రహదారిపై లారీ, టాటాఏస్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బల్వంతపూర్‌కు చెందిన కుటుంబ సభ్యులు టాటాఏస్‌లో కొమురవెల్లి మల్లన్న దర్శనానికి బయలుదేరారు. జిల్లెల్ల అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రధాన రహదారి వద్దకు చేరుకోగానే సిద్దిపేట నుంచి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 11 మందికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా..

- వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఏటా పెరుగుతున్న ప్రసవాల సంఖ్య
- ఆడపిల్ల పుడితే ఉచితంగా ఉయ్యాలలు అందజేత
- గతనెలలో 140 డెలివరీలు


వేములవాడ ఏరియా ఆస్పత్రిలో చిన్నారులతో వైద్యులు


ఉయ్యాలలు అందిస్తున్న వైద్యులు మహేశ్‌రావు

ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు	సంవత్సరం	సాధారణ	ఆపరేషన్	మొత్తం	కేసీఆర్ కిట్‌లు
	2022	254	494	748	644
	2023 మే	131	394	525	440

వేములవాడ అర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో రెండు సంవత్సరాల క్రితం వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. అప్పటి నుంచి వేములవాడ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాల సంఖ్య పెంచాలనే లక్ష్యంతో ఆశావర్కర్లు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు.

వైద్య బృందానికి అభినందన..

వేములవాడ ఏరియా ఆస్పత్రి ప్రారంభం నుంచి వందకు పైగా డెలివరీలు జరగడం రెండోసారి. మే నెలలో 140 డెలివరీలు కాగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బుధవారం కేక్ కట్ చేశారు. వైద్య బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు అభినందించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం వ్యక్తంచేస్తూ వైద్య బృందాన్ని అభినందించారు.

గతంలో ప్రైవేట్‌కు..

గతంలో డెలివరీ కోసం ఎక్కువ శాతం ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే రూ. 50వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుండేది. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా పేదలకు ప్రసవాలు చేస్తున్నారు. సాధారణ ప్రసవాల కోసం ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగింది.

గర్భిణుల వ్యాయామం

వేములవాడ ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్నారు. వ్యాయామాలు చేస్తూ గర్భిణులు మరింత ఉత్సాహంగా ఉంటున్నారు. వ్యాయామాలతో సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

ఉచితంగా ఉయ్యాలలు

మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి ఆడపిల్ల పుడితే వారికి ఉచితంగా ఉయ్యాలలు అందిస్తున్నారు. వేములవాడ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు సొంత డబ్బులతో ఉయ్యాలలు కొనుగోలు చేసి వారికి అందిస్తున్నారు. ఒక్కో ఉయ్యాలకు రూ. 800 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. ఇప్పటివరకు సుమారుగా 107 మందికి ఉయ్యాలలను అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆస్పత్రి సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గర్భిణులు ప్రతినెలా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెరిగేలా అవగాహన కల్పిస్తున్నాం. గతనెలలో 140 మందికి ప్రసవాలు జరిగాయి.

– మహేశ్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మాట కలుపుతూ.. మోసం చేస్తూ !

- సైబర్‌నేరస్తుల కొత్త పంథా
- పల్లెప్రజలే టార్గెట్

వీర్నపల్లి మండలంలోని బాబాయిచెరువుతండాకు చెందిన మహిళకు అపరిచితుల నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. డ్వాక్రా సంస్థ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి రూ.3వేలు తమకు ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.లక్ష తిరిగి జమ చేస్తామని నమ్మబలికారు. ఈ విషయాన్ని తన భర్తకు చెప్పడంతో వారి ఖాతాలో డబ్బులు లేకపోవడంతో కోనరావుపేట మండలంలోని బంధువుకు, రుద్రంగి మండలంలోని మరొకరికి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అపరిచితులు చెప్పిన మాటలు నమ్మి.. వారు పంపిన లింక్ ఓపెన్ చేయడంతో ఒకరి ఖాతా నుంచి రూ.88వేలు, మరొకరి ఖాతా నుంచి రూ.28వేలు విత్‌డ్రా అయ్యాయి. బాధితులు లబోదిబోమంటూ ఠాణాలకు వచ్చి ఫిర్యాదు చేశారు.

వీర్నపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి కొత్త నంబర్ నుంచి వీడియోకాల్‌లో మహిళ మాట్లాడింది. మహిళా నగ్నదృశ్యాలు కనిపించిన అర నిమిషంలోనే కాల్ కట్ అయ్యింది. వెంటనే మరో నంబర్ నుంచి మరొకరు కాల్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఇప్పటి వరకు మాట్లాడిన నగ్నదృశ్యాల వీడియో రికార్డ్ అయ్యిందని.. దాన్ని బయట పెట్టకుండా ఉండాలంటే రూ.లక్ష తమ ఖాతాలో జమ చేయాలని బెదిరించారు. దీంతో చేసేదేమీ లేక బాధితుడు వీర్నపల్లి పోలీసులను ఆశ్రయించాడు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వీర్నపల్లి(సిరిసిల్ల): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులే లక్ష్యంగా దాడి చేస్తున్నారు. వీడియోకాల్ చేసి కవ్విస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. సులభంగా డబ్బులు వస్తున్నాయని ఆశపడ్డ అమాయకులు నిండా మునుగుతున్నారు. లింక్‌లు పంపి.. ఖాతాల్లో ఉన్న సొమ్మును కాజేస్తున్నారు. ఓటీపీలు పంపి ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు.

లింక్‌లు పంపి.. ఖాతాలు ఖాళీ చేసి

అపరిచిత నంబర్‌ల నుంచి కాల్ చేసి లింక్‌లు పంపుతూ అమాయకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల షాపింగ్ వెబ్‌సైట్ పేరిట ఆఫర్లు ప్రకటిస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఆఫర్లకు ఆకర్షితులైన వారు షాపింగ్ చేసి డబ్బులు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు. అయితే ఇక్కడి వరకు సక్రమంగానే జరిగే వ్యవహారం డబ్బులు చెల్లించిన తర్వాత ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ మాయమవుతుంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఇప్పటికే రెండు, మూడు జరిగాయి.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అపరిచిత వ్యక్తులు కాల్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని పోలీసులు చెబుతున్నారు. తెలియని లింక్‌లు వస్తే అసలే ఓపెన్ చేయొద్దని కోరుతున్నారు. కొత్త నంబర్‌ల నుంచి వీడియోకాల్స్ వస్తే మాట్లావద్దని సూచిస్తున్నారు. ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంక్ ఖాతాదారులు వేలిముద్ర వేసి ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్) ద్వారా రోజుకు రూ.10వేల డ్రా చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ అవకాశాన్ని కూడా సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. వేలిముద్రలు వేసేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత వేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తతతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చు. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ మోసానికి గురైతే 1930లో ఫిర్యాదు చేయాలి. మోసపోయిన తర్వాత బాధపడే కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు.

– నవత, వీర్నపల్లి ఎస్సై

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

కథలాపూర్ (వేములవాడ): మేడిపెల్లి మండలకేంద్రం శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ బియ్యాల కుమార్ (35) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన బియ్యాల కుమార్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మేడిపెల్లి శివారులో చెట్టును ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ సందీప్, క్లీనర్ కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సందీప్‌ను బయటకు తీసి చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. లారీ క్లీనర్ కుమార్‌ను బుధవారం గుర్తించి క్యాబిన్‌లో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం/మల్లాపూర్: మద్యం మత్తులో రోడ్డుపై హంగామా సృష్టిస్తూ హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మల్లాపూర్ మండలం పాత దామ్‌రాజ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రోడ్డుపై హంగామా చేస్తున్నారని డయల్ 100కు ఫోన్ రావడంతో హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు పెట్రోలింగ్ వాహనంలో అక్కడికి వెళ్లారు. గ్రామ పంచాయతీ దగ్గరలో రోడ్డుపై కొంతమంది ఉండగా ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు. దీంతో దురుసుగా ప్రవరించడంతో పాటు హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించారు. పెట్రో కార్, బ్లూ కోర్ట్ ట్యాబ్‌లను ధ్వంసం చేశారు. దీంతో కొమ్ముల చిన్నారెడ్డి, రెండ్ల రాజిరెడ్డి, ఇప్ప గణేశ్, బెజ్జారపు నరేశ్, గజ్జి నరేశ్, గజ్జి రమేశ్, పొలాస సురేశ్, ఎనుగందుల రమేశ్, కలికోట గంగాధర్‌పై హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై లక్ష్మయ్య తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. బుధవారం సీఐ లక్ష్మీనారాయణ గ్రామంలో విచారణ చేపట్టారు.

సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సామాజిక మాధ్యమాల్లో ఇతరుల మనో భావాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ×తంగళ్లపల్లి మండల సమాచారం× అనే వాట్సాప్ గ్రూపులో ఇతరులను కించపరిచేలా పోస్టు చేసిన చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన జోగినిపల్లి రాజగోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న మొబైల్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

డీఎస్పీ విచారణ

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండలో అట్రాసిటీ కేసుపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మహేశ్, సూర్యనారాయణ, హరీశ్ కులంపేరుతో దూషించారని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం గ్రామంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. గల్ఫ్‌లో మోసపోయిన కథలాపూర్ మండలం అంబారిపేట, కలిగోట గ్రామాలకు చెందిన గిరిజనులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై శ్వేత ఉన్నారు.

మహిళలు, విద్యార్థినులకు అండగా షీటీం

- ఎస్పీ అఖిల్ మహాజన్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైమ్: జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు షీ టీం అండగా ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ షీ టీం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. గత నెలలో 21 ఫిర్యాదులు అందగా పోకిరీలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని.. ఒక కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, హాట్ స్పాట్‌లపై ప్రత్యేక నిఘా, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆపద సమయంలో 8712656425, డయల్ 100 సమాచారం అందించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి రూ.2.70 కోట్లు



మాట్లాడుతున్న చైర్ పర్సన్ జిందం కళ

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగింది. పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. వివిధ పనుల నిమిత్తం రూ. 2.70 కోట్లతో చేపట్టాల్సిన పనుల కోసం కౌన్సిల్ పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు. శానిటేషన్ వర్కర్లకు నెలకు రూ. 1000 చొప్పున రూ. 38.83 లక్షలు, ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు రూ. 42లక్షలు, రూ. 1.50 కోట్లతో పెద్దూరులో రెండు ప్రభుత్వ లేఅవుట్స్ అభివృద్ధికి రూ. 39.80 స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు రూ. 42 లక్షలు కేటాయించడాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిరస్కరించారు. ప్రస్తుత ఎజెండాలో అదే అంశాన్ని ప్రస్తావించడం, పలు అభివృద్ధి పనుల్లో కౌన్సిలర్లకు ప్రమేయం లేకపోవడం వంటి అంశాలపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిరాశ చెందినట్లు సమాచారం.

రేపటి నుంచి దశాబ్ది ఉత్సవాలు

జూన్ 2 నుంచి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పేర్కొన్నారు. 2న గాంధీచౌక్‌లో జాతీయ పతాకావిష్కరణ, అన్ని సర్కిల్స్, అమర వీరుల స్థూపానికి పూలతో అలంకరించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్ల నిరసన..

ఇక తమ వార్డులో అభివృద్ధి పనులకు రూ.75లక్షలు కేటాయించగా అందులో రూ. 49లక్షల వరకే పనులు చేయించారని, మిగతా రూ. 26లక్షల నిధులు అధికార పార్టీ ప్రాతినిధ్య వార్డులకు తరలించారని ఆరోపిస్తూ బీజేపీ కౌన్సిలర్ నిరసన తెలిపారు. తమ వార్డుకు నిధులు కేటాయించి మిగతా పనులను చేపట్టాలని కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- వెంకటాపూర్‌లో గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోందని, గ్రామాల్లో సంఘం భవనాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో రూ.9లక్షల వ్యయంతో నిర్మించనున్న గౌడ సంఘ భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ..గీత కార్మికులకు ప్రమాదబీమాతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంత్రి కేటీఆర్ సహకారంతో అన్నిగ్రామాల్లో గౌడ సంఘ భవనాలను ఏర్పాటు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల అంజమ్మ, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతి బాబు, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు సంగెం బాలయ్య, చాకలి దేవయ్య, మేడిశెట్టి శ్రీనివాస్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో స్థానికులకు ఉపాధి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ


రైస్‌మిల్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమలతో స్థానికులకు ఉపాధి లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని కొలనూర్ శివారులో ఉమామహేశ్వర ఇండస్ట్రీస్ (రైస్‌మిల్)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కొత్త పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, రాంమోహన్‌రావు, వైస్ చైర్మన్లు భూంరెడ్డి, కాశవేణి మహేశ్, ఎంపీపీ చంద్రయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచుల ఫోరం కన్వీనర్ పర్శయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, గోపాడి సురేందర్‌రావు, రైస్‌మిల్లర్స్ పబ్బ నాగరాజు, ఉపాధ్యక్షుడు వెన్నమనేని వంశీకృష్ణరావు, కోశాధికారి శ్రీనివాస్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలను మోసం చేస్తున్న బీఆర్ఎస్

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్


మాట్లాడుతున్న షేక్ గౌస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల): ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ... తొమ్మిదేళ్లుగా ముస్లింలకు ఒరిగిందేమీ లేదని, కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్‌సీ, 370డి ఆర్టికల్ ఆమోదిస్తే బీఆర్ఎస్ మద్దతు పలికిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న ముస్లింలు కాంగ్రెస్ పార్టీలో చేరాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే ముస్లిం అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి


మాట్లాడుతున్న కేకే.మహేందర్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓ వైపు వానాకాలం ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ రైతులు ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. దశాబ్ది వేడుకల పేరిట రైతులు సంబరాలు జరుపుకోవాలని పిలుపునివ్వడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, చిన్ని బాబు, కొత్తపల్లి దేవయ్య, మానక నాగరాజు యాదవ్, బానోత్ రాజునాయక్, చెరుకు ఎల్లయ్య, బీపేట రాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.